# సీఎం సభతో గులాబీ శ్రేణుల్లో జోష్



సభలో కేరింతలు కొడుతున్న కార్యకర్తలు (ఫైల్)

- నియోజకవర్గానికి వరాల జల్లుపై ప్రజల్లో హర్షం
- గ్రామాల్లో మరింత జోరందుకున్న ఎన్నికల ప్రచారం

తిమ్మాపూర్, నవంబర్ 21: మానకొండూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రజాఆశీర్వాద సభ సక్సెస్‌తో క్యాడర్ ఫుల్ జోష్‌లో ఉంది. తిమ్మాపూర్ మండలం శ్రీ చైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సభకు సీఎం కేసీఆర్ వచ్చి నియోజకవర్గానికి వరాల జల్లు కురిపించగా, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మెజార్టీ పెంపు లక్ష్యంగా గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రచార జోరు పెంచారు.

**50వేల మందికిపైగా రాక**

తిమ్మాపూర్‌లో నిర్వహించిన ప్రజాఆశీర్వాద సభకు సుమారు 50 వేల మందికి పైనే కార్యకర్తలు, మహిళలు తరలివచ్చారు. సీఎం కేసీఆర్ మాట్లాడుతున్నంతసేపు కార్యకర్తలు కేరింతలు కొడుతూ.. జోష్‌మీద ఉన్నారు. బెజ్జంకి, ఇల్లంతకుంట, శంకరపట్నం దూరంగా ఉన్న మండలాల నుంచి సైతం పెద్ద సంఖ్యలో ఆటోలు, బస్సులు, బైక్‌లపై పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

**దళితబంధుపై హర్షం**

మానకొండూర్ నియోజకవర్గానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కోరిక మేరకు నియోజకవర్గంలోని దళితులందరికీ దళితబంధు ఇస్తామని, స్వయంగా తానే వచ్చి దళిత సోదరులకు దళితబంధు యూనిట్లను అందజేస్తానని చెప్పడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని, నియోజకవర్గానికి తాను అండగా ఉంటానని స్వయంగా సీఎం కేసీఆర్ ప్రకటించడంతో ప్రజలు నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజలు చర్చించుకుంటున్నారు.

**నియోజకవర్గంలో బీఆర్ఎస్‌గాలి**

నియోజకవర్గానికి దళితబంధు ప్రకటనతో అన్ని పార్టీలకు చెందిన దళిత ఓటర్లు ఆలోచనలో పడ్డారు. అణగారిన జీవితాల్లో దళితబంధు కొత్త వెలుగులు నింపుతుందని దళిత కుటుంబాలు ఆనందంగా చెబుతున్నాయి. ఇక అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ వైపే నిలబడుతున్నారు. నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసిన తెలంగాణ ప్రభుత్వానికి మరోసారి అండగా నిలవాలనే సంకల్పంతో ఉన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా అభివృద్ధిపై చర్చిస్తున్నారు. పదేండ్ల అభివృద్ధి, సంక్షేమంతో పాటు సీఎం కేసీఆర్ సభతో నియోజకవర్గంలో బీఆర్ఎస్ గాలివీస్తున్నది.

## సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ సక్సెస్



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేశ్

తిమ్మాపూర్ రూరల్, నవంబర్ 21: మండలంలో సోమవారం జరిగిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం అయిందని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రావుల రమేశ్ తెలిపారు. రసమయి బాలకిషన్ హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా లక్ష మెజార్టీతో గెలువబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజా ఆశీర్వాద సభ విజయవంతం కావడానికి సహకరించిన మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్ రెడ్డి, తుమ్మనపల్లి శ్రీనివాస రావు, దుండ్రా రాజయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ పాశం అశోక్ రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు రాజేందర్, ఉప సర్పంచ్ బేతి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు వంగాల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



ఇల్లంతకుంట బస్టాండ్ ఆవరణలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఇల్లంతకుంట, నవంబర్ 21: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మండల దళిత సంఘాల అధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చాక మానకొండూర్ నియోజకవర్గంలో దళితులందరికీ దళిత బంధు పథకం అందిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు. దళితులు ఏకతాటిపై నడిచి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం దళితులను ఆదుకోలేదని, బీఆర్ఎస్‌తోనే దళితులకు న్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం దళిత సంఘాల నాయకులు రమేశ్, లక్ష్మణ్, రాజారాం, రమేశ్, బాబు, మధు, ఆనంద్, శ్రీనివాస్, రాములు, మోహన్, పోచమల్లు, విజయ్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్



అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

తిమ్మాపూర్, నవంబర్ 21: అసెంబ్లీ ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న పీవో, ఏపీవోలకు జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఆమె మంగళవారం సాయంత్రం హాజరై సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రంలో పని చేసే సిబ్బందికి టెండర్ ఓట్, పోల్ ఓటుపై అవగాహన ఉండాలన్నారు. ఓటర్లకు ఓటరు కార్డు లేకపోయినా ఎన్నికల సంఘం గుర్తించిన 12రకాల ఫొటో గుర్తింపు కార్డుల్లో ఒకదాన్ని అనుమతించాలన్నారు. మైనార్టీ మహిళా ఓటర్లను గుర్తించడానికి మహిళా సిబ్బందిని కేంద్రంలో వినియోగించుకోవాలని, ఏదైనా సమస్య వస్తే సెక్టోరల్ అధికారి దృష్టికి తీసుకెళ్లాలన్నారు. అధికారులు నిబద్ధతతో పని చేసి ఎన్నికలను విజయవంతంగా పూర్తిచేయాలన్నారు.

## ఎమ్మెల్యే రసమయికి ఘన సన్మానం

తిమ్మాపూర్/ శంకరపట్నం, నవంబర్ 21: ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ రసమయి బాలకిషన్‌ను దళిత సంఘాల నాయకులు మొలంగూర్ గ్రామంలో ఘనంగా సన్మానించారు. సీఎం కేసీఆర్ తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీలో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో మానకొండూర్ నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికీ దళితబంధు పథకం అందజేస్తామని హామీ ఇవ్వడంపై నియోజకవర్గ దళిత సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మొలంగూర్ ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే రసమయిని జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బోయిని కొమురయ్య ఆధ్వర్యంలో దళిత ప్రజాప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శంకరపట్నం మండల వైస్ ఎంపీపీ పులికోట రమేశ్, కల్వల సర్పంచ్ దాసారపు భద్రయ్య, హుజూరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చౌడమల్ల వీరస్వామి, శంకరపట్నం బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్, నాయకులు మొలంగూర్ మాజీ సర్పంచ్ మరాటి వెంకటేశ్వర్లు, బొజ్జ కోటిలింగం, మోరె శ్రీనివాస్, నెలవేణి మహేశ్, బెజ్జంకి లక్ష్మణ్, మాతంగి లక్ష్మణ్, శ్రీనివాస్, దుబ్బ నీరజ, కుంబాల లత, వంతడుపుల సంపత్, పారునంది జలపతి, ఖమ్మం కృష్ణ, స్వామి, సదయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.



మొలంగూర్‌లో ఎమ్మెల్యేను సన్మానిస్తున్న దళితనేతలు, కార్యకర్తలు

**బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు**

శంకరపట్నం, నవంబర్ 21: మండలంలోని కొత్తగట్టు గ్రామంలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన కార్యకర్తలు భారీగా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మెట్‌పల్లి సింగిల్ విండో డైరెక్టర్ మాడ రాజిరెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 150 మంది యువకులు ఈ సందర్భంగా పార్టీలో చేరగా, వారికి ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఇక్కడ ఎంపీపీ ఉమ్మెంతల సరోజన, సర్పంచ్ మొకిరాల కిషన్‌రావు, ఆలయ చైర్మన్ మలహల్‌రావు, మాజీ చైర్మన్ తూముల శ్యాంరావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉమ్మెంతల సతీశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ మత్స్య సంపద దినోత్సవం



మానకొండూర్: కేక్ కట్‌చేస్తున్న రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్

మానకొండూర్, నవంబర్ 21: ముదిరాజ్ మహాసభ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ప్రపంచ మత్స్య సంపద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పిట్టల రవీందర్ మాట్లాడుతూ, మత్స్యకారుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మత్స్యకారుల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి వారి జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ, మత్స్య సహకార సంఘాల నాయకులు, సభ్యులు కీసరి సదానంద్, బోయిని వెంకటేశ్, గొల్ల శ్రీనివాస్, పప్పు సమ్మయ్య, ఏరవేణి రామాంజనేయులు, పిట్టల మధు, నెల్లి మురళి, దండబోయిన శేఖర్, నెల్లి శంకర్, బాలెంకి మల్లేశం, బొమ్మరవేణి మల్లయ్య పాల్గొన్నారు.

## అనంతగిరిలో బీఆర్ఎస్ నాయకుల ప్రచారం

ఇల్లంతకుంట, నవంబర్ 21: మండలంలోని అనంతగిరి గ్రామంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె నర్సింహారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో బీఆర్ఎస్‌తోనే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. మానకొండూర్ ఎమ్మెల్యేగా డాక్టర్ రసమయి బాలకిషన్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గొట్టిపర్తి పరశురాం, ఉప సర్పంచ్ బాలకిషన్, నాయకులు సత్తిరెడ్డి, ముత్యం రెడ్డి, బాల గౌడ్, రాజారాం, అంజయ్య గౌడ్ తోపాటు తదితరులు ఉన్నారు.

## వరి పొలాల్లో కొండచిలువ కలకలం

శంకరపట్నం, నవంబర్ 21: మండలంలోని కాచాపూర్ శివారులోని వరి పొలాల్లో ఓ భారీ కొండ చిలువ కలకలం సృష్టించింది. కాచాపూర్ గ్రామానికి చెందిన ఇనకొండ సమ్మిరెడ్డి అనే రైతు మంగళవారం హార్వెస్టర్‌తో వరి కోస్తుండగా దాదాపు 10 అడుగుల భారీ కొండ చిలువ రైతులకు కనిపించింది. దీంతో అక్కడ ఉన్న వారు భయాందోళనలకు గురయ్యారు. అయితే హార్వెస్టర్ టైర్ల కింద పడి అప్పటికే మృతి చెందడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. పొలంలో కొండచిలువ గుడ్లు కూడా కనిపించినట్లు రైతులు తెలిపారు.

## ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు తనిఖీ

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 21: పట్టణ శివారులోని పరకాల క్రాస్‌రోడ్ వద్ద ఉన్న ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఏ విజయభాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ జీ దుర్గాభవానీతో కలిసి ఆయన మాట్లాడుతూ, అసెంబ్లీ ఎలక్షన్స్ దృష్ట్యా పట్టణంలోని మద్యం దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి స్టాక్ నిలువలు, రిజిస్టర్లను పరిశీలించి, రిజిస్టర్లు సరిగ్గా లేని వాటిపై కేసు నమోదు చేశామన్నారు.